

# మ్యూజికల్ మ్యూజింగ్స్

## - కస్తూరి మురళీకృష్ణ

**యె జిందగీ ఉసీకిహై, జోకిసీక హోగయా**

**ప్యార్ హీ మె ఖో గయా**

హిందీ సినీ గేయ ప్రపంచంలో సంగీత దర్శకుడు సి.రామచంద్ర, గేయ రచయిత రాజిందర్ క్రిషన్‌ల జంట అత్యద్భుతమైన పాటలను అందించిన జంట. సంగీత దర్శకుడు సి.రామచంద్ర పరమాద్భుతమైన సంగీత దర్శకుడు. ఆయన పాటలు ఎంత సులభంగా అనిపిస్తాయో అంత గొప్పవి. 'సంక్లిష్టత' అన్న పదమాయన బాణీలకు సరిపడదు. అలాగని తేలికయిన బాణీలు కావు. పాడేవారికి తెలుస్తుంది, బాణీలు ఎంత సన్క్లిష్టమయినవో!! పాట వినగానే పట్టేస్తుంది. దీనికి తోడు, ఆయన పాటలను అత్యంత వేగంగా రూపొందిస్తాడన్న పేరు పొందాడు. ఆయనకు తోడు రాజిందర్ క్రిషన్.

రాజిందర్ క్రిషన్ లాంటి గేయ రచయిత మరొకరు లేరనిపిస్తుంది, ఒకోసారి ఆలోచిస్తే. ఆ కాలంలో ప్రతి కళాకారుడు తన కళకు తనదైన ప్రత్యేక వ్యక్తిత్వాన్ని సినీ పరిధిలో ఒదుగుతూనే ఆపాదించారనిపిస్తుంది. ఎవరి పాటలు వింటూంటే వారిని మించిన వారు ఇంకొకరు లేరనిపిస్తుంది. సాహిర్, శైలేంద్ర, మజ్రూహ్, షకీల్, భరత్ వ్యాస్, కవి ప్రదీప్ ఇలా ఎవరి సృజనను చూస్తే, వారే పరమాద్భుతం అనిపిస్తుంది. వారి సృజనలో వారి వ్యక్తిత్వం కనిపిస్తుంది. కానీ ఒకరో ఇద్దరో గేయ రచయితల పేర్లు మాటిమాటికీ ప్రస్తావిస్తూండటం వల్ల ఆయా గేయ రచయితలు ఇతరుల కన్నా ఉత్తమం అనో నెంబర్ వన్ అనో అభిప్రాయం కలుగుతుంది. అంతే తప్ప ఆకాలంలోని ఏ కళాకారుడూ ఇంకో కళాకారుడికన్నా తక్కువకాదు. భగవంతుడు అత్యద్భుతమైన కళాకారులందరినీ ఒకేసారి భూమి మీదకు పంపించాడేమో.. ఒక రెండు మూడు దశాబ్దాలు వారీ భూమిపై సంగీత స్వర్గాన్ని సృష్టించి, భావితరాలకు అత్యత్తుమ కళాసృజన మార్గదర్శకాలను ఏర్పరచి వెళ్లిపోయారేమో అనిపిస్తుంది.

1945-1970 నడుమ హింది సినీ స్వర్ణ యుగం సృష్టించి ఒకరొకరే కనుమరుగయ్యారనిపిస్తుంది. కేవలం సంగీత దర్శకులు, గేయ రచయితలే కాదు గాయనీ గాయకులు, నటీనటులు, దర్శకులు, నిర్మాతలు, ఒకరేమిటి, సినీ రంగానికి సంబంధించిన అత్యుత్తమ కళాకారులంతా కూడబలుక్కుని ఒకేసారి జన్మించి, కలసి అత్యద్భుతాలు సృష్టించి కనుమరుగయ్యారనిపిస్తుంది.

సి. రామచంద్ర ఒక రకంగా హిందీ సినీ సంగీత దిశానిర్దేశకుడు అనవచ్చు. ఆయన తన సృజనకు ఎలాంటి పరిధులు, పరిమితులు నిర్ణయించుకోలేదు. ఎలాంటి అడ్డంకులు, అభ్యంతరాలను లెక్కపెట్టలేదు. మన సమాజంలో ఒక కళాకారుడు ఎంతో ఆలోచించి సృష్టించే కళ గొప్పది అన్న అపోహ ఉంది. కానీ కళాసృజన అన్నదానికి ప్రధానం 'ప్రేరణ'. కొందరికి ప్రేరణ ఎంతో కష్టపడితేకానీ లభించదు. మరికొందరు ప్రతి అంశం నుంచి, ప్రతిక్షణం ప్రేరణ పొందవచ్చు. వారికి ఆకు కదలికలో లయ కనిపిస్తుంది. గాలి వీయటంలో తాళం తెలుస్తుంది. పదం తీసి పదం వేయటంలో పల్లవి స్ఫురిస్తుంది. చీకటి వెలుతుర్లలో చరణాలు చమక్కుమంటాయి. వారికి జీవితంలో అనుక్షణం సృజననే. అలాంటివారు ఇతరులు పదం కదిపేలోగా పాటను సృజిస్తారు. ఇతరులు తమ కళను చెక్కుతూ శ్రమించే సమయంలో వీరు నీటి అలలపై తళతళలాడే ముత్యాల్లాంటి కిరణాల సమూహంలాంటి కళను సృజిస్తూ పోతారు. వీరింత వేగంగా కళను సృజించటం వల్ల వారి సృజన నాణ్యంలో ఎలాంటి లోపం ఉండదు. పైగా సంవత్సరాల తరబడి శ్రమించి సృజించే వారి సృజనకు ఏమాత్రం తీసిపోదు వీరి సృజన. కానీ సమాజంలో నెలకొని ఉన్న అపోహల వల్ల వీరి కళపట్ల చులకన భావాన్ని పండితులు వ్యక్తపరుస్తారు. కానీ సృజనాత్మక ప్రవాహంలో మునకలేస్తూ ఆనందిస్తున్న కళాకారుడికి ఇవేవీ పట్టవు. తన కళాసృజనలోని ఆనందాన్ని అనుభవిస్తూ ప్రపంచాన్ని పట్టించుకోడు కళాకారుడు. ఎవరేమన్నా 'నాకేమిటి?' అన్న రీతిలో తన కళను సృజిస్తూ, ప్రపంచాన్ని పరిమళ భరితం చేస్తూ ముందుకు సాగుతాడు. అలాంటి కళాకారుడు సి. రామచంద్ర.

సినీ సంగీత దర్శకులు తమ పాటలు ఉత్తమ సాహిత్యంలో అలరారాలని తపిస్తున్న సమయంలో 'మెరె పియా గయా రంగూన్, కియా హై వహాన్ సె టెలిఫోన్' వంటి పదాలతో పాటను సృజించాడు సి. రామచంద్ర. పాశ్చాత్య వాయిద్యాలను వాడటం తప్పు అని గిరిగీసుకుంటున్న సమయంలో 'అనా మెరీ జాన్ మెరీ జాన్ ఆనా సండే కె సండే' లాంటి పాశ్చాత్య బాణీతో, మామూలు మాటల పదాలతో కూడిన పాటను సృజించి దేశాన్ని ఉర్రూతలూగించాడు. కానీ విమర్శకులు అతని పాటలకు ఊగిపోతూ అతడిని కాక ఇతరులను పైకెత్తుతూ పోయారు. సి. రామచంద్ర పట్టించుకోలేదు.

సి. రామచంద్ర ప్రత్యేకత ఏమిటంటే, అదే బాణీని అటు సంతోషం వ్యక్త పరచే పాటకూ, ఇటు విషాదాన్ని ప్రదర్శించే పాటకూ వాడాడు. ఒకే పాటలో బాణీ మార్చి సంతోషం, విషాదాలను వ్యక్తపరచే పాటలను శంకర్ జై కిషన్ ఆరంభించారు 'పత్లి కమర్ హై' (బర్సాత్) పాటతో. కానీ బాణీని ఏమాత్రం మార్చకుండా, కేవలం వాయిద్యాలు పలికే విధానాన్ని మారుస్తూ, పాటలో పదాలు వ్యక్తపరచే భావాన్ని మారుస్తూ పాట 'మూడ్'ను మార్చే ప్రక్రియకు ఆద్యుడు సి. రామచంద్ర. విమర్శకులు 'గైడ్' సినిమాలో 'మోసే ఛల్ కియ జాయ్', 'క్యాసె క్యా హోగయా' పాటలను చూపించి, ఎస్డీ

బర్మన్ అద్భుతమైన ప్రయోగం చేశాడని పొగుడుతారు. కానీ ఆ ప్రయోగానికి దశాబ్దం క్రితమే సి. రామచంద్ర ఒకటి కాదు, రెండు కాదు బోలెడన్ని పాటలలో ఇలాంటి ప్రయోగం సమర్ధవంతంగా చేశాడు. ప్రేక్షకులను అలరించాడు.

'యె జిందగీ ఉసీకి హై' పాట సినిమాలో రెండుసార్లు వస్తుంది. ఒకసారి ఆనందం, మరోసారి విషాదం. ఆనందంగా పాడే సందర్భంలో నాయక 'యె జిందగీ ఉసీకి హై' అంటూ ఆనందంగా పాడుతుంది విషాదం సమయంలో కూడా. చివరలో సజీవ సమాధి అవుతూ 'ఇవే పదాలు, ఇదే బాణీతో పాడుతుంది నాయిక. కానీ గాయని స్వరంలో ధ్వనించే విషాదం పాటను విషాదమయం చేస్తుంది. ఇంటర్ల్యూడ్ సంగీతం విషాదాన్ని ఇనుమడింపచేస్తుంది. 'యె జిందగీ ఉసీకిహై' రెండు వేర్వేరు సందర్భాలలో వస్తుంది. అయితే 'అల్బేలా' సినిమాలో 'ధీరే సే ఆజారి ఆజారి' 'అఖియన్' సినిమాలో రెండు సార్లు వస్తుంది. మొదటిసారి నాయకుడిని నిద్రపుచ్చుతూ చెల్లెలు పాడుతుంది. సంతోషకరమయినపాట ఇది. రెండోసారి నాయికతో నాయకుడు రొమాంటిక్ గా పాడుతూంటాడు. అదేపాట కొనసాగుతూ, అదే బాణీ, 'విషాదం'లోకి రూపాంతరం చెందటం పరమాద్భుతమైన ప్రక్రియ. ఒక్క సెకనులో 'మూడ్' మారిపోతుంది.

నాయిక నాయకుడు కారులో ప్రయాణిస్తూంటారు. నాయిక నాయకుడి భుజంపై తల వాలుస్తుంది.

**ధీరే సే ఆజారే అఖియన్ మే**

**నిందియ ఆజరే ఆజా ధీరే సే ఆజా.**

అత్యంత మృదువుగా, మధురంగా పాడతాడు సి. రామచంద్ర ఈ పాటను. ఆయన పాటలను 'చితల్కర్ ' అన్న పేరుతో పాడేవాడు. ఈ పాటను కూడా రాసిందిరాఇందర్ క్రిషన్. పాట రికార్డింగుకు వెళ్తూ కారులో ఈ పాట బాణీని సృజిస్తే, కారు స్టూడియో చేరేలోగా రాఇందర్ క్రిషన్ పాటను రాసాడని చెప్తా రు. అంత వేగంగా సృజించినా పాటలో ఆ హడావిడి కనిపించదు.

అసలు పాట ఆరంభమే సుతిమెత్తగా ఉంటుంది. అసలు ఈ పాట తెరపై వస్తూంటే నాయిక కళ్లు మెల్లిగా మూతపడతాయి. వినేవారి మనస్సు శాంతమవుతుంది. మెల్లిగా కళ్లు మూసుకుంటాయి. హృదయం ప్రశాంత శాంత సాగరాల మయం అవుతుంది.

**చుప్ కే సే నైన న్ కి బగియన్ మే**

**నిందియా ఆజారె ఆజా ధీరే సే ఆజా.**

పదాల వాడకం అద్భుతం. బాణీలో పాలలో నీరు కలసినట్టు కలసిపోతాయి. 'నైనన్ కి బగియన్' కనుల పూదోట. కనుల పూదోటలోకి నెమ్మదిగా నిద్రను ఆహ్వానిస్తున్నాడు. అసలు ఎంత అద్భుతంగా అనిపిస్తుందో ఆలోచిస్తూంటే. పీలూ రాగం ప్రధానంగా 'ఠుమ్రీ'లకు వాడతారు. 'ఠుమ్రీ ' అన్నది నృత్యగీతం. 'ఠుమ్రీ' అన్నది ప్రత్యేకంగా నర్తకిలు వాడే నృత్య గాన సంవిధానం. ఆరంభంలో ఇది 'భజన'లకోసం వాడేవారు. తరువాత ఇది 'నృత్యగానం' అయింది. ఠుమ్రీ ప్రత్యేకత

ఏమిటంటే గానం తిన్నగా హృదయాన్ని తాకుతుంది. ఎటువంటి డొంకతిరుగుళ్లు లేకుండా సూటిగా హృదయాన్ని తట్టిలేపుతుంది. అత్యంత మృదువైన రాగం ఇది. పీలూని 'రంగుల రాగం' అంటారు.

అలాంటి 'రొమాంటిక్ ' రాగాన్ని అత్యద్భుతమైన 'జోల'పాటగా, విషాదగీతంగా మలచాడు సి. రామచంద్ర.

**'లేకర్ సుహానే సప్నోంకె కలియా**

**ఆకే బసాదే పల్ కోంకి గలియా**

**పల్ కోంకి ఛోటీ సీ గలియన్‌మే**

**నిందియా ఆజారీ ఆజా..**

అద్భుతం అనిపిస్తుంది పదాలు వింటూ అనుభవిస్తూంటే. అందమైన స్వప్నాల మొగ్గలను తీసుకువచ్చి ఆమె కనురెప్పల వీధులలో ఉంచమంటున్నాడు. అలాంటి కనురెప్పల వీధులలోకి నిద్రను నెమ్మదిగా రమ్మంటున్నాడు. పాటలో పదాలు పడిన స్థలాలు, పదాలు వాడిన విధానం కళ్లముందు ఒక గొప్ప పంచవర్ణాల చిత్రపటాన్ని నిలుపుతుంది. 'సప్నోంకి కలియా ', 'పల్కోంకి గలియా' అన్న తరువాత ఇవే పదాలను విడదీసి 'పల్కోంకి ఛోటీసే గలియన్' అనటం మనసుని ఆనందపు ఆకాశాలలో విహరింపచేస్తుంది. నాయికపైన నాయకుడికి ఉన్న లోతైన ప్రేమను తెలుపుతుంది. మానసిక శాస్త్రం ప్రకారం పురుషుడు తన ప్రేయసిలో తల్లిని వెతుకుతాడు. స్త్రీ తన పురుషుడిలో తండ్రిని వెతుకుతుంది. ఇక్కడ పురుషుడు ఆమెని పసిపిల్లలా భావించి నిద్రపుచ్చటం, పాడపాడూతూండటం ఒక అద్భుతమైన భావనను కలిగిస్తుంది. పైగా పాటను క్లోజప్పులో చిత్రీకరించటం, నాయకుడి హావభావాలు, నాయిక కళ్లల్లో కనిపించే ఆనందం, సంతృప్తి– పాత్రలను, వాటి భావనలను ప్రేక్షకుడికి మరింత చేరువచేస్తాయి. అందుకే ఈ పాటలు, దృశ్యాలు జీవితాంతం మరపురానివిగా మిగిలిపోతాయి. ఇందుకు భిన్నంగా ఓ గుంపులో నాయికా నాయికలు ఎగురుతూ, గెంతుతూ, వారి శరీర భాగాలను క్లోజప్పుల్లో ముఖాలను లాంగ్ షాట్లో చూపిస్తూ, వారి కదలికలకు పాటలోని పదాలకు సంబంధం లేకుండా ఉంటే, కళ్లు చూస్తాయి, మెదడు గ్రహించదు. అందుకే పాట గుర్తుండదు. బాణీ గుర్తుండదు. నాయికా నాయకులు, నేపథ్యంలో గొంతులు కలవు. చెప్పుకోటానికి ఏమీ మిగలదు.

పాటను పాడుతూ నాయకుడు నాయిక భుజం చుట్టూ చేయి వేసి దగ్గర తీసుకోవటం, ఆమె సంతృప్తిగా కళ్లు మూసుకుని పడుకోవటం, గాఢ నిద్రను తెలిసేట్టు కొద్దిగా పెదిమలు దూరం చేయటం, నాయకుడు ఆమె కురులు నిమురుతూండటం.. ఓహ్... ఒక అద్భుతమైన ప్రశాంతమైన శృంగార ప్రపంచంలోకి వెళ్లిపోతాం. ముఖ్యంగా ప్రేయసీ ప్రియుల నడుమ ఒకరిపై ఒకరికి ఉండే విశ్వాసం భద్రతా భావనలను అనుభవిస్తాం. స్త్రీ పురుష సంబంధంలోని ఉద్రేకం, ఉద్వేగం, లైంగికతల కన్నా అత్యంత ప్రధానమైన భావనలు విశ్వాసం, భద్రత అని ఈ దృశ్యం ప్రదర్శించినంత గొప్పగా మరే దృశ్యం ప్రదర్శించదు అనటం అనృతం కాదు. అతిశయోక్తికాదు.

**తారోంసె చుప్ కర్ తారోంసే చోరీ**

**దేతీ  హై చందా రజనీ కో లోరీ**

**హస్తా భీ హై చందా నిందియన్ మే**

**నిందియా ఆజారీ ఆజా ధీరే సే ఆజా.**

అద్భుతమైన దృశ్యాన్ని అక్షరాలతో హృదయమనే కాన్వాస్‌పై గీస్తున్నాడు గేయరచయిత. తారలలో దాగి, దొంగతనంగా రాత్రి చంద్రుడికి జోలపాట వినిస్తోందట. అంటే జోలపాట పాడుతోందట. ఆ జోలపాట వింటూ నిద్రలో చంద్రుడు నవ్వుతాడట. అంటే ఇక్కడ చంద్రుడు నాయిక. నాయకుడు రజని..రాత్రి...తారలలోదాగి జోలపాట పాడుతున్నాడు. ఎందుకంటే తారలు వెలుగునిస్తాయి. వెలుగు నిద్రను రానివ్వదు.  అదే సమయానికి నాయకుడి భుజంపై నిద్రించిన నాయిక పెదిమలు విచ్చుకుంటాయి. ఎంత గొప్ప కళాకారులు వారు! తలచుకుంటే మనకు మన సినిమాల్లోనే కాదు నిజ జీవితంలో కూడా మానవ సంబంధాలలోని మాధుర్యాన్ని ఏ స్థాయిలో కోల్పోయామో అర్థం అవుతుంది. మనసు బాధపడుతుంది.

అయితే ఈ రొమాంటిక్ శాంత సాగరంలో ఓలలాడుతూ దాదాపుగ ట్రాన్స్ లోకి వెళ్లిపోయే వాళ్లం ఉలిక్కిపడతాం. తెరపై నాయకుడి చెల్లెలి వదనం కనిపిస్తుంది. లత విహ్వలంగా, విషాదంగా ఆలాపన తీస్తూ కనిపిస్తుంది. క్షణంలో మూడ్ మారిపోతుంది. అదే బాణీ. కానీ ఇప్పుడు పాటలో శాంతం లేదు. రొమాన్స్ లేదు. భద్రత లేదు.

**జగతీ హై అభియా, సోతీ హై కిస్మత్**

**దుష్మన్ గరీబోంకే హోతీ హై కిస్మత్**

**దంభర్ గరీబోంకె కుటియన్‌మే**

**నిందియా ఆజారీ ఆజా ధీరే సే ఆజా.**

ఒక్క దృశ్యం, ఒక భావం, ఒక పదంతో 'మూడ్' మారిపోయింది. మనస్సుని విషాదం క్రమ్ముకుంటుంది. నాయకుడు పట్నానికి వస్తాడు. గొప్ప హీరో అయిపోతాడు. ధనవంతుడు అవుతాడు. నాయికతో ఐశ్వర్యం అనుభవిస్తూంటాడు. కానీ అతడిని వెతుకుతూ అతని చెల్లెలు, తండ్రి వస్తారు.  వారు దుర్భర దారిద్ర్యంలో మ్రగ్గుతూంటారు. ఆ బాధలో తినటానికి తిండిలేక రోడ్డులో ఓ మూల కూర్చుంటారు. అప్పుడు అతడి చెల్లెలు రాగాలాపన చేస్తుంది.

'కళ్లు మేల్కొని ఉంటాయి. కానీ అదృష్టం నిద్రిస్తోంది'. ఈ ఒక్క వాక్యం చాలు మనస్సును మెలిపెట్టటానికి. అంతకు ముందు ఇదే పాటను చలాకీగా చిలిపిగా పాడిన లత గొంతు ఎంతో విషాదాన్ని ఉట్టిపడుతూంటుంది. ఆ స్వరం

వేదనపు రాగితీగ అయి మనస్సును మెలిపెడుతుంది. చుట్టుకుంటుంది. 'జగ్తీ హై అఖియా, న్, సోతీ హై కిస్మత్' అదృష్టం నిద్రించినపుడే కదా మనిషికి నిద్రరానిది. పేదవాళ్ల శత్రువు అదృష్టం.

అంతేకదా! అదృష్టం మిత్రుడయితే ఇక పేదరికం ఏమంటుంది? కాబట్టి కనీసం పేదవాడి ఇంటికి ఒక్క క్షణం కోసమైనా నిద్రను రమ్మంటోంది. 'కునుకు పడితే మనసు కాస్త కుదుట పడతది' అంటారు. కానీ పేదవాడికి, బాధలో ఉన్నవాడికి నిద్రరాదు. అలాంటి వాడికి కాస్సేపు నిద్రపట్టినా అది అదృష్టమే. ఆమె ఈ చరణం పాడుతున్నంత సేపు ఆమె తండ్రి విషాదం నిండిన ఒక విగ్రహంలా కళ్లు తెరుచుకుని కూర్చుని ఉంటాడు. అన్ని ఆశలూ నశించి, సర్వం కోల్పోయినవాడి విగ్రహం.  అది పాట ప్రభావాన్ని పెంచుతుంది. కెమేరా కూడా ఆమె ముఖం క్లోజప్ నుంచి కదలి పక్కన రాయిలా ఉన్న అతని వైపుకి వెళ్లి, నెమ్మదిగా దూరం వెళ్తూ ఇద్దరినీ చూపిస్తుంది. ఆమె ఏడుస్తూంటుంది. అతడు అన్ని ఆశలూ కోల్పోయి రాయిలా ఉంటాడు. వేదనను ఇనుమడింపచేస్తుంది. ఆజా అన్నప్పుడు ఇంటర్ల్యూడ్‌లో  విషాద సంగీతం పాట ప్రభావాన్ని పెంచుతుంది. కెమేరా వాళ్లిద్దరినీ వదలి చుట్టూ మూగిన వారివైపు మళ్లుతుంది. ఇంతలో ఓ బిచ్చగాడు వారివైపు వస్తూంటాడు పాట వింటూ.

**ఆంఖేతో సబ్‌కే హై ఏక్ జైసీ**
**జైసీ అమీరోంకీ గరీబోంకీ వైసీ**
**కిస్మత్ కే మారోంకీ అఖియన్‌మే**
**నిందియా ఆజారీ ఆజా ధీరేసే ఆజా**

ఆ బిచ్చగాడు దగ్గరకు వస్తాడు. తెరపై ఆమె, బిచ్చగాడు మాత్రమే ఉంటారు. దృశ్యానికీ పాట భావానికీ నడుమ సమన్వయం సాధిస్తే కలిగే ప్రభావాన్ని ఈ దృశ్యం గొప్పగా ప్రదర్శిస్తుంది. అందరికళ్లు ఒకే రకం. అందరూ అవే దృశ్యాలను చూస్తారు. కానీ ఎవరి స్పందన వారిది. పేదవారి కళ్లు, ధనవంతుడి కళ్లూ ఒకే రకం. కానీ వాళ్లు చూసే ఒకే దృశ్యాన్ని అనుభవించే విధానంవేరు. ఆమె పాడుతున్నంతసేపూ బిచ్చగాడు ఇంతింత కళ్లు వేసుకుని రెప్ప వాల్చకుండా ఆమెవైపు చూస్తాడు.  ఆమె పాడుతూ అనుకోకుండా చేయి ఆస్తుంది. ఆమెకు పక్కన ఎవరో వున్న స్పృహవుండదు. కానీ దగ్గరకు వచ్చిన బిచ్చగాడు ఆ సాచివున్న చేతిలో తన దగ్గరవున్న చిల్లరనాణెం వేస్తాడు.
గుండె కరిగి నీరయిపోతుంది.

ఇక్కడే రాజిందర్ క్రిషన్ పదాల శక్తి తెలుస్తుంది. ధనికుడికి పేదవాడికి కళ్ళు ఒకటే..కానీ పేదవాడి గుండె స్పందిస్తుంది. కళ్ళు చెమరుస్తాయి. ధనికుడి గుండె కరగదు. కళ్ళు పేదరికాన్ని చూడవు. ధనికుది గుండె ద్రవిస్తే పేదరికమేవుండదు. గేయ రచయిత రాసిన పదాలు సందర్భంలో ఎంత గొప్పగా వొదిగిపోయాయో, బణీ, గానం.

దృశ్యం..ఆ అర్థాన్ని ఎంతో ప్రతిభావంతంగా ప్రదర్శించాయో ఆలోచించే స్థితిలో వుండడు ప్రేక్షకుడు. వాటి సమ్యుక్త ప్రభావ ఫలితమయిన సంవేదనల తుఫానుతాకిడికి ఉక్కిరిబిక్కిరయి కన్నీరు కారుస్తాడు.

ఇదీ కళాకారుడి శక్తికి తిరుగులేని నిదర్శనం. ఈ కళ ఒక్క గంటలో సృష్టిస్తే ఏమిటి? కొన్ని ఏళ్ళు శ్రమపడి సృజిస్తే ఏమిటి? చివరికి ప్రదర్శితమైన కళ ఎలాంటి ప్రభావం చూపిస్తుందన్నది ప్రాధాన్యం వహిస్తుంది తప్ప ఇతరాలేవీ కావు. ఈ ఒక్క పాట చాలు సి. రామచంద్ర, రాజిందర్ క్రిషన్, భగవాన్ (నటుడు, స్క్రీన్‌ప్లే, దర్శకుడు) కెమేరామెన్ శ్రమలకి జీవితాంతం తరతరాలు కృతజ్ఞులై ఉండటానికి. ఈ ఒక్క పాటతో జోలపాడి నిద్రపుచ్చుతాడు. చర్నాకోలాతో ఛళ్ళుమని కొట్టి జీవితంలోని కఠినమైన చేదు నిజాలను చెప్తాడు. ఒక వ్యక్తి ఎంతగొప్ప వాడయినా, ఎంత ఐశ్వర్యం అనుభవిస్తూన్నా తన వారిని మరచిపోవటం క్షమించరాని బాధ్యతారాహిత్యం అని కొన్నివేల ఉపన్యాసాలు, నీతి బోధలూ అర్థం చేయలేని విషయాన్ని ఒక్క దృశ్యంతో బోధపరుస్తుందీ పాట. కళాకారుడి చేతిలో అతని కళను అనుభవించేవారు ఉట్టి తోలుబొమ్మలు. కళాకారులు ఎలా ఆడిస్తే అలా ఆడతారు. నవ్విస్తే నవ్వుతారు. ఏడ్పిస్తే ఏడుస్తారు. ఉద్రేక పరిస్తే ఉద్రేకపడతారు. అలాంటి దైవసమాన శక్తి కల కళాకారులు, ప్రేక్షకులు ఏవి చూస్తారో అవి తీస్తాము, మా అద్భుతమైన కళ ప్రేక్షకులు మెచ్చరు అని తమ చేతకానితనంపై ముసుగు కప్పి ప్రేక్షకులను తమ వైఫల్యానికి, సృజనాత్మకరాహిత్యానికి బాధ్యులను చేస్తూంటే మనసు విషాదంతో మూల్గుతుంది. ఒక్క పాటతో, ఒక్క పదంతో ప్రేక్షకులను తమ వెంట నడిపించే ఆనాటి కళాకారులనుంచి పాఠాలు నేర్చుకోని తరాన్ని, వారినే ఉత్తములుగా భావిస్తున్న తరాలను చూసి 'జాలి' అనిపిస్తుంది. 'యె జిందగీ ఉసీ కి హై' పాడుకుంటూండిపోవాలనిపిస్తుంది.

**(వచ్చే నెల మరిన్ని పాటలతో..)**

Post your comments